
నాక్ మెచ్చేలా.. ఏయూ ముస్తాబు

రేపటి నుంచి ఆరుగురు సభ్యుల బృందం పర్యటన


ఇంజినీరింగ్ కళాశాలలో సాధన చేస్తున్న విద్యార్థులు


సుందరంగా దర్శనమిస్తున్న భౌతికశాస్త్ర విభాగం

ఏయూ క్యాంపస్: నేషనల్ అసెస్‌మెంట్ అండ్ అక్రిడిటేషన్ కౌన్సిల్(నాక్) పీర్ కమిటీ పర్యటనకు ఏయూ ముస్తాబవుతోంది. ఈ నెల 4, 5, 6 తేదీల్లో ఆరుగురు సభ్యుల కమిటీ బృందం ఏయూలో పర్యటించనుంది. కమిటీ పర్యటనకు అనుగుణంగా అవసరమైన ఏర్పాట్లు అధికారులు పూర్తి చేశారు. ఇప్పటికే వర్సిటీలో ప్రతి విభాగాన్ని సుందరంగా తీర్చిదిద్దారు. కమిటీ మూడు రోజుల పర్యటనకు సంబంధించిన షెడ్యూల్ శుక్రవారం ఖరారు కానుంది. ప్రతి విభాగాన్ని కమిటీ సభ్యులు సందర్శించే అవకాశం ఉన్న నేపథ్యంలో తదనుగుణంగా అధికారులు అన్ని చర్యలు చేపట్టారు. ఇప్పటికే విభాగాల వారీగా అవసరమైన మౌలిక వసతులు కల్పన పూర్తి చేశారు. సుందరీకరణ పనులు సైతం తుది దశకు వచ్చాయి.

అధికారుల నిరంతర పర్యవేక్షణ

కమిటీ సభ్యులు పరిశీలించే ప్రధాన విభాగాలు, కళాశాలలను ఇప్పటికే సుందరంగా తీర్చిదిద్దారు. విభాగాలకు వెళ్లే మార్గాలు, ఫుట్‌పాత్‌లను ఆకర్షణీయంగా తయారు చేశారు. ప్లాస్టిక్ వినియోగాన్ని నియంత్రించడం, ర్యాగింగ్ నిషేధం, దిశ చట్టంపై అవగాహన తదితర అంశాలపై తయారు చేసిన ప్రత్యేక సైన్ బోర్డులను వర్సిటీలో ప్రధాన కూడళ్ల వద్ద ఏర్పాటు చేశారు. పారిశుద్ధ్య సిబ్బంది నిరంతరం వర్సిటీలో వ్యర్థాలను ఎప్పటికప్పుడు తరలించడం, రహదారులను శుభ్రం చేయడం చేస్తున్నారు. ఏయూ వీసీ ఆచార్య ప్రసాదరెడ్డి, రిజిస్ట్రార్ ఆచార్య ఎం.జేమ్స్ స్టీఫెన్ ప్రతి విభాగాన్ని ఇప్పటికే పలుమార్లు సందర్శించారు. అవసరమైన సూచనలు చేస్తూ పనులు పూర్తి చేశారు. నాక్ కమిటీ సభ్యులు సందర్శనకు వచ్చే సమయంలో తమ


రంగులు అద్దిన వర్సిటీ ప్రవేశ ద్వారం

విభాగ ప్రగతిని ఆయా విభాగాధిపతులు వివరించాలని సూచించారు. గతంలో కంటే మెరుగైన ర్యాంక్ ఏయూ సాధించే లక్ష్యంగా అధికారులు ఎంతో శ్రమిస్తున్నారు. ప్రస్తుతం లభించే ర్యాంక్ రానున్న ఆరు సంవత్సరాలకు దోహదపడనుంది. శతాబ్ది వేడుకలకు చేరువవుతున్న ఏయూ మెరుగైన ర్యాంక్ సాధించాలని అంతా ఆకాంక్షిద్దాం..

క్లుప్తంగా

23వ వార్డులో అన్నదానం


భక్తులకు వడ్డిస్తున్న కార్పొరేటర్ గుడ్ల విజయసాయి, వార్డు ఇన్‌చార్జి సత్యారెడ్డి

మద్దిలపాలెం : శరన్నవరాత్రి ఉత్సవాలలో భాగంగా గురువారం జీవీఎంసీ 23వ వార్డు చైతన్యనగర్ మెట్ట ప్రాంతంలో సూపర్ బాయ్స్ యూత్ అసోసియేషన్ ఆధ్వర్యంలో అన్నదానం కార్యక్రమం నిర్వహించారు. కార్పొరేటర్, జీవీఎంసీ స్టాండింగ్ కమిటీ సభ్యురాలు గుడ్ల విజయసాయి, వైఎస్సార్‌సీపీ వార్డు ఇన్‌చార్జి గుడ్ల సత్యారెడ్డి పాల్గొని భక్తులకు అన్నప్రసాదం వడ్డించారు. ఈ కార్యక్రమంలో సూపర్ బాయ్స్ యూత్ అసోసియేషన్ ప్రతినిధులు పాల్గొన్నారు.

అయ్యప్ప స్వాములకు ఉచిత భిక్షకు శ్రీకారం

ఆరిలోవ: జీవీఎంసీ 10వ వార్డు ఇందిరానగర్‌లో మణికంఠ మిత్ర బృందం ఆధ్వర్యంలో 41 రోజుల పాటు ఉచిత భిక్ష కార్యక్రమం గురువారం ప్రారంభమైంది. కాలనీలో దశరథ రామాలయం ఆవరణలో అయ్యప్ప స్వాముల పూజా మండపం ఏర్పాటు చేశారు. ఈ మండపంలో రోజుకు 1,000 మందికిపైగా స్వాములకు అన్నదానం చేయనున్నట్టు మిత్ర బృందం సభ్యుడు మణికంఠ ప్రసాద్ తెలిపారు. ఈ కార్యక్రమాన్ని స్వాములు విజయవంతం చేయాలని కోరారు. తొమ్మిది సంవత్సరాల నుంచి ఈ కార్యక్రమం చేపడుతున్నట్లు ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో మిత్ర బృందం స్వాములు పాల్గొన్నారు.

ఆకట్టుకున్న పెయింటింగ్స్


ప్రదర్శనలో ఉంచిన పెయింటింగ్స్

బీచ్ రోడ్డు: నీటి సంరక్షణ, సుస్థిర ప్రాముఖ్యతను వివరిస్తూ దేశంలోని 25 మంది కళాకారులతో వారం పాటు గీసిన పెయింటింగ్స్ ప్రదర్శన ఆకట్టుకుంది. విశ్వ సముద్ర గ్రూప్ ఆధ్వర్యంలో బీచ్ రోడ్డులోని ఓ హోటల్‌లో ది సముద్ర ఆర్టిస్ట్స్ పేరుతో ఎగ్జిబిషన్‌ను గురువారం ఏర్పాటు చేశారు. శుక్రవారం విశాఖలో జరగనున్న ఐసీఐడీ ఇంటర్నేషనల్ కాంగ్రెస్‌ను పురస్కరించుకుని ఈ ప్రదర్శన ఏర్పాటు చేసినట్టు నిర్వాహకులు తెలిపారు. విశాఖకు చెందిన ఐదుగురు కళాకారులు దీంట్లో పాల్గొన్నారన్నారు.

ముత్యాలమ్మపాలెం తీరంలో బోటు బోల్తా


దెబ్బతిన్న బోటు

పరవాడ: ముత్యాలమ్మపాలెం సముద్ర తీరంలో చేపల వేటకు వెళ్లిన బోటు బోల్తా పడింది. ఈ ప్రమాదంలో బోటు దెబ్బతినడంతో రూ.2 లక్షల ఆస్తి నష్టం వాటిల్లిందని మత్స్యకార నాయకుడు సూరాడ ముత్యాలరావు చెప్పారు. గ్రామానికి చెందిన వాసుపల్లి తాతారావు, మారయ్య, వాసుపల్లి నల్లయ్య, అరిజిల్లి కుమార్, పరదేశి గురువారం తెల్లవారుజామున బోటుపై చేపల వేటకు వెళ్లారు. చేపల వేట ముగించుకుని తిరుగు వస్తున్నారు. అల్పపీడన ద్రోణి ప్రభావంతో వీచిన ఈదురు గాలులకు అలలు ఎగసిపడడంతో బోటు బోల్తా పడింది. సమీపంలోని రాళ్లను ఢీ కొట్టడడంతో విరిగిపోయింది. వల సముద్రంలో మునిగిపోయింది. ఈ ప్రమాదంలో మత్స్య కార్మికులు స్వల్పంగా గాయపడి.. ప్రాణాలను అరచేతిలో పెట్టుకుని ఒడ్డుకు చేరారు. దెబ్బతిన్న బోటుపై 10 కుటుంబాలు ఆధారపడి జీవనం సాగిస్తున్నాయి.

మర్యాద పూర్వక కలయిక



ఐసీఐడీ సదస్సులో పాల్గొనేందుకు గురువారం విశాఖ విచ్చేసిన ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డిని మధురవాడలోని హెలీప్యాడ్ వద్ద ఎమ్మెల్సీలు వంశీకృష్ణ శ్రీనివాస్, వరుదు కల్యాణి మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందజేశారు. - ఆరిలోవ

స్కేటింగ్ క్రీడాకారిణి పూజితకు అభినందన


స్కేటింగ్‌లో పతకాలు సాధించిన పూజితను అభినందిస్తున్న మేయర్ హరి వెంకటకుమారి

ఆరిలోవ: ఆరిలోవ ప్రాంతానికి చెందిన మూడో తరగతి విద్యార్థిని స్కేటింగ్‌లో ప్రతిభ కనబరిచింది. రెండు కాంస్య పతకాలు సాధించి నగర మేయర్ గొలగాని హరివెంకటకుమారి మన్ననలు పొందింది. ఇటీవల వీఎంఆర్‌డీఏ పార్కులో రోలర్ స్కేటింగ్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా ఆధ్వర్యంలో జిల్లా స్థాయి స్కేటింగ్ పోటీలు జరిగాయి. ఈ పోటీల్లో పదో వార్డు రవీంద్రనగర్‌కు చెందిన పూజిత రెండు కాంస్య పతకాలు సాధించింది. ఈ చిన్నారి స్థానిక శ్రీకృష్ణా గ్రామర్ స్కూల్‌లో మూడో తరగతి చదువుతోంది. ప్రతిభకనబరిచిన పూజితను గురువారం పెదగదిలిలోని క్యాంప్ కార్యాలయంలో మేయర్ అభినందించారు. పూజిత క్రీడల్లో మరింత రాణించాలని ఆకాంక్షించారు. పూజిత రెండు నెలలు శిక్షణ తీసుకుని ఈ పతకాలను సాధించడం విశేషం. ఈ కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నాయకుడు గొలగాని శ్రీనివాస్, పూజిత తల్లిదండ్రులు, కోచ్ పాల్గొన్నారు.

సూర్యతేజనగర్‌లో ఆక్రమణకు అడ్డుకట్ట


సూర్యతేజనగర్‌లో ఆక్రమణ స్థలంలో హెచ్చరిక బోర్డు ఏర్పాటు చేస్తున్న సచివాలయం సిబ్బంది

ఆరిలోవ: జీవీఎంసీ 12వ వార్డులో గెడ్డ స్థలం ఆక్రమణకు సచివాలయం సిబ్బంది అడ్డుకట్ట వేశారు. సూర్యతేజనగర్‌లో రాజీవ్ ఆవాస్ యోజన(రే) పథకంలో భాగంగా జీవీఎంసీ అధికారులు ప్రత్యేకంగా లేఅవుట్ వేసి ఇళ్ల నిర్మాణాలు చేపట్టారు. సామాజిక అవసరాలు, గ్రీనరీ కోసం కొన్ని చోట్ల గెడ్డ అంచున ఖాళీ స్థలాలు విడిచిపెట్టారు. ఇక్కడ స్థానిక సంఘంలో కొందరు పెద్దలు, రాజకీయ నాయకులు కలసి ఆయా స్థలాలను ఆక్రమించి విక్రయించేస్తున్నారు. ఇలా ఇక్కడ గెడ్డ అంచున గ్రీనరీ కోసం కేటాయించిన స్థలాన్ని ఆక్రమించి ఇటీవల ఓ వ్యక్తికి విక్రయించేశారు. ఆ స్థలం కొనుగోలు చేసిన వ్యక్తి కొద్ది రోజులుగా ఇక్కడ ఇంటి నిర్మాణం చేపడుతున్నాడు. ఈ విషయం తెలుసుకున్న సంబంధిత సచివాలయం సిబ్బంది గురువారం వెళ్లి పనులు నిలిపివేశారు. కోలమ్స్ కోసం వేసిన ఇనుప రాడ్లను కట్ చేసి నేలమట్టం చేశారు. అనంతరం ఈ స్థలం ప్రభుత్వానికి చెందినదని, ఆక్రమించినవారు శిక్షార్హులవుతారంటూ హెచ్చరిక బోర్డు ఏర్పాటు చేశారు. ఈ కాలనీలో మరిన్ని ఆక్రమణలు, అనధికారికంగా వేసిన శ్లాబులు ఉన్నాయని సచివాలయం సిబ్బంది తెలిపారు. వాటిని ఉన్నతాధికారులు దృష్టిలో పెడతామన్నారు.

విద్యా సమాచారమ్

ర్యాగింగ్ నిషేధంపై పోస్టర్ ఆవిష్కరణ


పోస్టర్ ఆవిష్కరిస్తున్న డీన్ ఆచార్య విజయ్‌మోహన్

ఏయూ క్యాంపస్: ఆంధ్ర విశ్వవిద్యాలయంలో ర్యాగింగ్ నిషేధం, పర్యవసనాలు, చట్టాలపై అవగాహన కల్పించేలా తీర్చిదిద్దిన ప్రత్యేక పోస్టర్లను ఏయూ విద్యార్థి వ్యవహారాల విభాగం డీన్ ఆచార్య ఎస్.విజయ్‌మోహన్ గురువారం తన కార్యాలయంలో ఆవిష్కరించారు. ప్రథమ సంవత్సరం తరగతులు ప్రారంభమైన నేపథ్యంలో ర్యాగింగ్ నిషేధంపై అవగాహన కల్పిస్తున్నారు. వర్సిటీలోని వివిధ ప్రధాన కూడళ్ల వద్ద కూడా ర్యాగింగ్ నిషేధంపై ప్రత్యేక బోర్డులు తయారు చేసి ఏర్పాటు చేశారు.
ఈ కార్యక్రమంలో పాలక మండలి సభ్యురాలు ఆచార్య పి.సునీత, ఆచార్య కె.సీతామాణిక్యం, ఆచార్య ఎ.కె.ఎం.పవార్, డాక్టర్ బెన్నీ తదితరులు పాల్గొన్నారు.

ఎఫ్‌డీపీ తరగతులు ప్రారంభం

ఏయూ క్యాంపస్: ఆంధ్ర విశ్వవిద్యాలయం, ఐసీటీ అకాడమీ సంయుక్తంగా నిర్వహిస్తున్న మూడు రోజుల ఫ్యాకల్టీ డెవలప్‌మెంట్ కార్యక్రమాన్ని ఏయూ రిజిస్ట్రార్ ఆచార్య ఎం.జేమ్స్ స్టీఫెన్ గురువారం ప్రారంభించారు. ఇంజినీరింగ్ కళాశాలలోని వైవీఎస్ మూర్తి ఆడిటోరియంలో ఐడియా జనరేషన్ మెథడ్స్ అంశంపై మూడు రోజుల పాటు ఈ తరగతులు జరగనున్నాయి. ఈ సందర్భంగా రిజిస్ట్రార్ మాట్లాడుతూ ఇటువంటి శిక్షణ కార్యక్రమాలు అధ్యాపకుల సామర్థ్యాలను పెంపొందించడానికి ఎంతగానో ఉపకరిస్తాయన్నారు. ఏయూ అనుబంధ కళాశాలలకు చెందిన 170 మంది అధ్యాపకులు హాజరయ్యారు. ఈ కార్యక్రమంలో కాలేజ్ డెవలప్‌మెంట్ కౌన్సిల్ డీన్ ఆచార్య సి.ఎస్.వి.సత్యనారాయణరెడ్డి, ఐసీటీ అకాడమీ స్టేట్ హెడ్ దినకర్‌రెడ్డి, రీజినల్ మేనేజర్ బి.ప్రవీణ్‌కుమార్, తదితరులు పాల్గొన్నారు.

గెస్ట్ హౌస్‌లో స్వచ్ఛభారత్


స్వచ్ఛభారత్‌లో పాల్గొన్న సిబ్బంది

ఏయూ క్యాంపస్: ఆంధ్ర విశ్వవిద్యాలయం ప్లాటినం జూబ్లీ గెస్ట్‌హౌస్‌లో గురువారం స్వచ్ఛ భారత్ కార్యక్రమం నిర్వహించారు. గురువారం గెస్ట్‌హౌస్ డీన్ ఆచార్య టి.షారోన్‌రాజు సిబ్బందితో కలిసి వ్యర్థాలను తొలగించారు. చెట్లకు పెయింటింగ్ వేశారు.

25న విరాట్ హిందూ సమ్మేళనం

ఎంవీపీకాలనీ: ఎంవీపీ కాలనీలోని అళ్వార్‌దాస్ మైదానంలో ఈ నెల 25న విరాట్ హిందూ సమ్మేళనం నిర్వహించనున్నారు. విరాట్ హిందూ సంఘ ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం జరగనుంది. దీనికి సంబంధించిన కరపత్రాన్ని బీజేపీ ఎంపీ జీవీఎల్ నరసింహారావు గురువారం లాసన్స్ బే కాలనీలోని పార్టీ కార్యాలయంలో ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ హిందుత్వంపై అసాంఘిక శక్తుల దాడులను అడ్డుకోవడానికి ఇలాంటి సమ్మేళనాలు అవసరమన్నారు. కొంతమంది కొన్ని వర్గాల మెప్పు కోసం సనాతన ధర్మాన్ని కించపరిచేలా మాట్లాడుతున్నారన్నారు. అలాంటి వారి వ్యాఖ్యలను ఖండించాల్సిన అవసరం హిందుత్వ వాదులపై ఉందన్నారు. హిందుత్వాన్ని రక్షించుకునేందుకు వచ్చే ఎన్నికల్లో కేంద్రంలో బీజేపీ ప్రభుత్వాన్ని గెలిపించాలన్నారు. ఈ కార్యక్రమంలో పలువురు బీజేపీ నాయకులు, సంఘ ప్రతినిధులు పాల్గొన్నారు.

పాలస్తీనా-ఇజ్రాయిల్ యుద్ధంపై 5న సదస్సు

మద్దిలపాలెం : పాలస్తీనాపై ఇజ్రాయిల్ దాడి, ఐక్య రాజ్య సమితి పాత్ర అనే అంశంపై ఈ నెల 5వ తేదీ ఉదయం 10 గంటలకు బుల్లయ్య కళాశాల గాంధీ సెంటర్‌లో బీవీ ఫౌండేషన్ ఫర్ పీస్ అండ్ హార్మోనీ, వైజాగ్ ఎన్జీవో ఫోరం సంయుక్తంగా సదస్సు నిర్వహించనున్నాయని నిర్వాహకుడు నరవ ప్రకాశరావు ఒక ప్రకటనలో తెలిపారు. మాజీ ఎమ్మెల్సీ ఎం.వి.ఎస్.శర్మ, దామోదర్ సంజీవయ్య లా యూనివర్సిటీ పూర్వ వీసీ ఆచార్య సుధ అతిథులుగా పాల్గొంటున్నారన్నారు. మరిన్ని వివరాలకు కోసం 90324 77463 నంబర్‌లో సంప్రదించాలని ఆయన కోరారు.

డయాలసిస్ బాధితుడికి పింఛన్

ఆరిలోవ: జీవీఎంసీ 13వ వార్డులో ఓ డయాలసిస్ బాధితుడికి ప్రభుత్వం పింఛన్ మంజూరు చేసింది. లక్ష్మీనగర్‌లో ఎ.అప్పారావు కొన్నాళ్లుగా కిడ్నీ వ్యాధితో బాధపడుతున్నారు. ఆయన డయాలసిస్ చేయించుకుంటున్నారు. ఇటీవల అప్పారావు పింఛన్ కోసం ప్రభుత్వానికి దరఖాస్తు చేసుకున్నాడు. దరఖాస్తును పరిశీలించిన రాష్ట్ర ప్రభుత్వం ఆయనకు ఈ నెల నుంచి డయాలసిస్ పింఛన్ మంజూరు చేసింది. ఈ మేరకు గురువారం మొదటి నెల పింఛన్ రూ.10 వేలు నగదును కార్పొరేటర్ కెల్ల సునీత సచివాలయం సిబ్బందితో కలసి ఆయన నివాసానికి వెళ్లి అందజేశారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నాయకులు కెల్ల సత్యనారాయణ, దుర్గారావు, వెంకటరెడ్డి, వలంటీరు పాల్గొన్నారు.

ముడసర్లోవ పార్కులో తుప్పల తొలగింపు


ముడసర్లోవ పార్కు గట్టుపై పిచ్చి మొక్కలు తొలగిస్తున్న సిబ్బంది


శుభ్రం చేసిన భారతమాత మ్యాప్ ఉన్న గట్టు భాగం

ఆరిలోవ: ప్రముఖ పర్యాటక ప్రాంతం ముడసర్లోవ పార్కులో జీవీఎంసీ అధికారులు తుప్పల తొలగింపు చర్యలు చేపట్టారు. ఈ పార్కు పూర్తిగా పిచ్చి మొక్కలతో నిండిపోయి అస్తవ్యస్తంగా తయారైంది. పాముల సంచారం ఎక్కువైపోయింది. దీంతో ఈ పార్కుకు సందర్శకులు వెళ్లలేని పరిస్థితి నెలకొంది. త క్రమంలో పార్కు నిర్వహణ చూస్తున్న ముడసర్లోవ నీటి సరఫరా విభాగం ఏఈ అప్పాజీ ఇక్కడ సిబ్బందితో కొద్ది రోజులుగా పిచ్చి మొక్కలను తొలగించి శుభ్రం చేయిస్తున్నారు. పిల్లల ఆట స్థలాల్లో పెరిగిన తుప్పలను తొలగించారు. ఆట పరికరాల వద్ద చెత్త, గోతులు లేకుండా సిద్ధం చేస్తున్నారు. ముడసర్లోవ రిజర్వాయరు గట్టుపై కూడా పిచ్చి మొక్కలు తొలగిస్తున్నారు. రానున్న కార్తీక మాసాన్ని దృష్టిలో పెట్టుకొని పార్కు అంతటా శుభ్రం చేయిస్తున్నామని ఏఈ తెలిపారు. సందర్శకులకు అనుకూలంగా ఉండేటట్టు తయారు చేస్తున్నామన్నారు.

అవినీతి రహిత సమాజానికి కృషి

ఎంవీపీ కాలనీ: విజిలెన్స్ అవగాహన వారోత్సవాలను ఎంవీపీ కాలనీలో విజిలెన్స్ డిపార్ట్‌మెంట్‌లో గురువారం నిర్వహించారు. అనంతరం కాలనీలో ర్యాలీ చేపట్టారు. ఈ సందర్భంగా విజిలెన్స్ అడిషనల్ ఎస్పీ స్వరూపరాణి ముఖ్యఅతిథిగా మాట్లాడుతూ కరప్షన్ రహిత సమాజం కోసం ప్రతి ఒక్కరూ కృషి చేయాలన్నారు. అవినీతి కారణంగా ప్రజలు అనేక సమస్యలు ఎదుర్కొంటున్నారన్నారు. దీని ప్రభావం దేశ అభివృద్ధిపై పడుతుందన్నారు.
ఈ నేపథ్యంలో అవినీతి రహిత సమాజం కోసం అందరూ నడుం కట్టాలన్నారు. ఈ కార్యక్రమంలో విజిలెన్స్ విభాగ అధికారులు, ఉద్యోగులు, విద్యార్థులు పాల్గొన్నారు.

'ఆరోగ్య సురక్ష' సద్వినియోగం చేసుకోవాలి


అంగన్‌వాడీ పౌష్టికాహార స్టాల్‌ను పరిశీలిస్తున్న కార్పొరేటర్ అప్పారి శ్రీవిద్య

మద్దిలపాలెం : జగనన్న ఆరోగ్య సురక్ష వైద్య శిబిరాలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని జీవీఎంసీ 15వ వార్డు కార్పొరేటర్ అప్పారి శ్రీవిద్య అన్నారు. పాత వెంకోజీపాలెంలో అర్బన్ ఆరోగ్య కేంద్రం పరిధిలోని ఎంఎంటీసీ, ఏపీఎస్‌ఈబీ కాలనీ, అంబేడ్కర్‌నగర్ కాలనీ సచివాలయాల ప్రజల కోసం గురువారం ఏర్పాటు చేసిన జగనన్న ఆరోగ్య సురక్ష వైద్య శిబిరాన్ని ఆమె ప్రారంభించారు. అనంతరం కార్పొరేటర్ మాట్లాడుతూ ప్రజల ఆరోగ్యానికి ఈ వైద్య శిబిరాలు భరోసాగా నిలుస్తాయన్నారు. ఈ శిబిరంలో సుమారు 450 మందికి వైద్య పరీక్షలు చేసి, అవసరమైన మందులు అందజేశారు. ఈ కార్యక్రమంలో పాత వెంకోజీపాలెం ఆరోగ్య కేంద్రం వైద్యులు రెనిషా, సిబ్బంది, వైఎస్సార్‌సీపీ వార్డు ఇన్‌చార్జి అప్పారి గిరిబాబు, జిల్లా కార్యవర్గ సభ్యుడు పీలా వెంకట్, అడ్మిన్ వరలక్ష్మి, సీవో నర్సింహులు, బుగత ఏసురత్నం, నరాల సత్తిబాబు, గొలగాని త్రినాథ్, నూతపాటి దిలీప్ కుమార్ పాల్గొన్నారు.

అవినీతి నిర్మూలనలో కీలక పాత్ర పోషించాలి


అవినీతి నిర్మూలన వారోత్సవ సభలో అధ్యాపకులు, విద్యార్థులు

మద్దిలపాలెం : అవినీతి నిర్మూలనలో విద్యార్థులు కీలక పాత్ర పోషించాలని డాక్టర్ వీఎస్ కృష్ణా ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ విజయబాబు కోరారు. అవినీతి నిర్మూలన వారోత్సవాలను కళాశాలలో గురువారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులకు వ్యాస రచన పోటీలు నిర్వహించి, విజేతలకు బహుమతులు అందజేశారు. అనంతరం ప్రిన్సిపాల్ మాట్లాడుతూ సమాభివృద్ధికి విద్యార్థులు కృషి చేయాలన్నారు. అవినీతి రహిత సమాజా స్థాపనలో విద్యార్థుల పాత్ర కీలమైనదన్నారు. ఈ కార్యక్రమంలో ఓరియంటల్ ఇన్సూరెన్స్ కంపెనీ డిప్యూటీ జనరల్ మేనేజర్ కోటేశ్వరరావు, రీజనల్ మేనేజర్ సతీష్, కళాశాల అధ్యాపకులు పాల్గొన్నారు.

ఏయూలో లిక్విడ్ క్రిస్టల్స్‌పై పరిశోధనలు


రెక్టార్ సమతను సత్కరిస్తున్న సదస్సు నిర్వాహకులు

ఏయూక్యాంపస్: ఆంధ్రవిశ్వవిద్యాలయంలో భౌతిక శాస్త్ర విభాగంలో నిర్వహిస్తున్న 30వ జాతీయ లిక్విడ్ క్రిస్టల్స్ జాతీయ సదస్సును ఏయూ రెక్టార్ ఆచార్య కె.సమత ప్రారంభించారు. గురువారం నుంచి మూడు రోజుల పాటు సదస్సు కొనసాగుతుంది. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఏయూ భౌతిక శాస్త్ర విభాగం సర్ సీవీ రామన్ నుంచి స్ఫూర్తిని పొందిందని, తరువాత కాలంలో ఆయన శిష్యులు ఆచార్య సూరి భగవంతం బలమైన పునాదులు నిర్మించారన్నారు. నేడు భారత్ అణుశక్తి, అంతరిక్ష, ఐవోటీ రంగాలలో అద్వితీయ ప్రగతిని సాధిస్తోందన్నారు. ఎల్‌సీడీల ఆవిష్కరణ తదనంతర మార్పులు వివరించారు. మూడు రోజుల సదస్సును పరిశోధకులు సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఆర్‌ఆర్‌ఐ ఎమిరిటస్ ప్రొఫెసర్ కేఏ సురేష్ మాట్లాడుతూ సుదీర్ఘ కాలంగా ఏయూలో లిక్విడ్ క్రిస్టల్స్‌పై పరిశోధనలు జరుగుతున్నాయన్నారు. ఈ రంగంలో పీసీ పతి చేసిన పరిశోధనలు, కృషిని వివరించారు. ఇండియన్ లిక్విడ్ క్రిస్టల్ సొసైటీ అధ్యక్షుడు ఆచార్య రవీంద్ర ధర్ మాట్లాడుతూ లిక్విడ్ క్రిస్టల్స్‌పై పరిశోధనలు దేశ వ్యాప్తంగా వివిధ విశ్వవిద్యాలయాల్లో జరుగుతున్న విధానాన్ని వివరించారు. ఈ సందర్భంగా అందించే పలు అవార్డులను ప్రకటించారు. కార్యక్రమంలో విభాగాధిపతి ఆచార్య ఎస్.శ్రీనివాస రావు, రీసెర్చ్ అండ్ డెవలప్‌మెంట్ విభాగం డీన్ ఆచార్య కె.బసవయ్య, సదస్సు కన్వీనర్ ఆచార్య ఎం.రామకృష్ణ నాంచార రావు ప్రసంగించారు. సదస్సులో దేశ వ్యాప్తంగా వివిధ ప్రాంతాలకు చెందిన పరిశోధకులు, ఆచార్యులు పాల్గొన్నారు.

ఎంవీపీ సీఐ సంజీవరావు బాధ్యతల స్వీకరణ


సీఐ సంజీవరావు

ఎంవీపీ కాలనీ: ఎంవీపీ కాలనీ పోలీస్ స్టేషన్ సర్కిల్ ఇన్‌స్పెక్టర్‌గా జి.సంజీవరావు గురువారం బాధ్యతలు స్వీకరించారు. ఇటీవల నగర సీపీ కార్యాలయంలో పెద్ద ఎత్తున సీఐలను బదిలీ చేస్తూ ఉత్తర్వులు జారీ చేసిన విషయం తెలిసిందే. ఇందులో భాగంగా ఎంవీపీ కాలనీ సీఐగా పని చేసే మల్లేశ్వరరావును సిటీ విఆర్‌కు బదిలీ చేశారు. ప్రస్తుతం సిటీ వీఆర్‌లో విధులు నిర్వర్తిస్తున్న సంజీవరావు ఎంవీపీ లా అండ్ ఆర్డర్ సీఐగా నియమితులయ్యారు. బాధ్యతలు తీసుకున్న ఆయనకు పలువురు సిబ్బంది అభినందనలు తెలిపారు.

కనక మహాలక్ష్మికి సహస్ర తులసీదళార్చన

దాబాగార్డెన్స్: నగరంలోని బురుజుపేటలో వెలసిన కనకమహాలక్ష్మి దేవస్థానంలో గురువారం సహస్ర తులసీదళార్చన నిర్వహించారు. ఉదయం 7 నుంచి 8 గంటల వరకు నిర్వహించిన పూజలో నలుగురు ఉభయదాతలు పాల్గొన్నారు. అమ్మవారి త్రికాల పంచామృతాభిషేక సేవలో ఆరుగురు ఉభయదాతలు పాల్గొన్నారు. సహస్ర తులసీదళార్చనలో పాల్గొనదలచే భక్తులు రూ.1,500, త్రికాల పంచామృతాభిషేక సేవలో పాల్గొనే భక్తులు రూ.1,000 పూజా రుసుము చెల్లించాలని ఆలయ ఈవో కె.శిరీష తెలిపారు.

నేవీలో ఉద్యోగం పేరిట రూ.5.67 లక్షలకు టోకరా

తగరపువలస: నేవీలో తన కుమార్తెకు ఉద్యోగం ఇప్పిస్తానని జేవీ అగ్రహారం(అప్పికొండవీధి)కి చెందిన ఆదిలక్ష్మి దఫదఫాలుగా తన నుంచి రూ.5,67,000 కాజేసి ఇప్పుడు ముఖం చాటేసిందని తోటవీధికి చెందిన గరుగు సావిత్రి ఆరోపిస్తోంది. బీఎస్సీ చదువుతున్న తన కుమార్తె కల్యాణికి నేవీలో మునీషా బేగం అనే మహిళ ద్వారా ఉద్యోగం ఇప్పిస్తానని ఈ మొత్తాన్ని కాజేసినట్టు బాధితురాలు తెలిపింది. ఉద్యోగం కోసం మరో రూ.1.60 లక్షలు అడగటంతో మోసపోయినట్టు గుర్తించినట్లు చెప్పింది. దీనిపై గతంలో భీమిలి పోలీసులకు ఫిర్యాదు చేయగా సెప్టెంబర్‌లో రూ.20 వేలు ఇచ్చి మిగిలిన వాయిదాలు చెల్లించలేదన్నారు. విడతల వారీగా డబ్బులు తిరిగి ఇస్తానని ఆదిలక్ష్మి పోలీసుల ముందు అంగీకారపత్రం ఇచ్చి.. ఇప్పుడు ముఖం చాటేస్తోందన్నారు. కుమార్తె ఉద్యోగం కోసం అప్పులు తెచ్చి మోసపోయానని, పోలీసులు జోక్యం చేసుకుని న్యాయం చేయాలని ఆమె విజ్ఞప్తి చేస్తోంది.